

# నాగమణి పెళ్ళి

కొండముది శ్రీరామచంద్రమూర్తి

నాగమణిని నేనక్కడ కలుసుకుంటానను కోలేదు. ఏ మాత్రం ముందుగా తెలిసివున్నా నేనక్కడకు వెళ్ళకపోదును. ఒకవిధంగానాకు నాగమణి అంటే భయం. కోపం. జెలసీ. అందుకనే ఆరేళ్ళక్రితం ఆంధ్రాయూనివర్సిటీలో ఫైనల్ ఇయర్ యం ఏ. ఎగ్జామ్స్ రానేసి, ఇంటికి తిరిగి వచ్చేసిం తర్వాత,నాగమణి ఒకటి రెండు ఉత్తరాలు వ్రాసినా,కావాలని జవాబు వ్రాయకుండా వూరుకొన్నాను అప్పటికి—

యం. ఏ. లో ప్రీవియస్‌లో చేరి ఒకటి రెండు నెలలు కూడా ఇంకా కాలేదు. ఒక రోజున రామకృష్ణామిషన్ ఎదురుగా, ఐస్ క్రీమ్ తింటూ ఓ సాయంకాలం బీచ్‌లో సరదాగా అటూయిటూ తిరుగుతున్న సమయంలో హఠాత్తుగా అడిగేసింది. "మిస్టర్‌రావ్ ! నీకు పెళ్ళయిందట నిజమేనా ?"

నేను తెల్లబోయాను. నిజమే! నాకు అప్పటికే పెళ్ళయింది. కానీ ఆ సంగతి ఎవరికీ తెలియకుండా ఎంతో జాగ్రత్తపడ్డాను. అటువంటిది హఠాత్తుగా నాగమణి ఆ ప్రశ్నఅడిగేసరికి...మొహానికి పట్టిన చెమట తుడుచు కుంటూ, "నిజమే! నాగమణీ!" అన్నాడు మెల్లగా. నాగొంతు నాకే బీదగా ధ్వనించింది.

"ఏవన్నా పి...ల్ల...లా?"

నాగమణి గొంతులో వెటకారం. నేనేం సమాధానం చెప్పలేదు. "కేరీయింగ్" అందామనుకొన్నాను. కానీ ధైర్యం చాలలేదు. కన్నవారి మాటకాదనలేక బి. ఏ. లోనే పెళ్ళి చేసుకోవలసి వచ్చింది. పెళ్ళయీ కాకుండానే కోడల్ని కాపరానికి తీసుకురాక తప్పదని అమ్మ పేచీ పెట్టింది. కమ్మ కస్తూరి వంటి భార్య కళ్ళముందు కనిపిస్తుంటే అఘ్రాణించకుండా వుండటానికి నేనేం ఋషినికాను. ఆ ఆనందపారవశ్యంలో బి.ఎ సంగతే రెండేళ్ళు పట్టించుకోలేదు. చివరకు బి. ఏ. పూర్తిచేసి ఇహ చదువుకు ఫుల్‌స్టాప్ పెడదాం అనుకుంటుండగా ఓ రోజురాత్రి నాన్న నన్ను వంటరిగా తన గదిలోకి పిలిచి పక్కలో కూచో పెట్టుకుని ప్రేమగా అన్నాడు.

"బాబూ! యౌవనం ఒక గాలివాలు లాంటిది. వచ్చినంతసేపు పట్టదు. వెళ్ళిపోవడానికి ఆ యౌవనంలో లభించే ఆనందాన్నే నమ్ముకుని, జీవితంలో మిగిలిన కార్యక్రమాలను నిరాదరణ చేస్తే, మనవ్యక్తిత్వం మనకు మిగలదు. నువు చదివిన ఈ బి. ఏ. ఇవ్వాళ దేశంలో లక్షలమంది చదువుతున్నారు. అందుకని కనీసం యం. ఏ. అన్నా చదువు. ఎక్కడో లెక్చరరుగా అన్నా బ్రతకొచ్చు"

అట్లా వచ్చాను ఆంధ్రాయూనివర్సిటీలోకి.

"పిల్లనుకూడాతీసుకువెళ్ళి కాపరంపెట్టరా!" అని అమ్మ ఒకటే గొడవ.

"వీల్లేదు" అన్నారు నాన్న కఠినంగా."ఈ రెండేళ్ళూ వాడు హాస్టల్లోనేఉంటాడుఅమ్మాయి నీ దగ్గరే వుంటుంది.

హాస్టల్లో చేరిన మొదట్లో కొంచెం కష్టంగా ఉన్నా, తర్వాత కొత్తగా లభించిన ఫ్రీడమ్ ఎంతో హాయిగా ఉందనిపించింది. నేనూ బాచిలర్‌గానే ఫీల్‌కావడం మొదలెట్టాను. నాగమణితో మరింత చనువుగా ఉండడం మొదలెట్టాను. ఒకటిరెండుసార్లు 'అప్సర'కు వెళ్ళాం ఇద్దరం కలసి, ఎయిర్‌కండిషన్ డైనింగ్ హాల్లో, జోక్సువేసుకుంటూ స్పెషల్‌మీల్స్ చేశాం. అటువంటిస్థితిలో నాగమణి "పిల్లలా?" అంటూ వెటకారం చేస్తే ఎంతబాధగా ఉంటుందీ? నేనేం సమాధానం చెప్పకపోవడం చూసి మళ్ళీ నాగమణి అన్నది.

"నాకు తెలుసురావ్. మీ ఆవిడ ఇప్పుడు కడుపుతో ఉంది.

నేను ఉలిక్కిపడ్డాను. నాగమణివేపుఏరుగ్గా చూశాను.

"యూసిల్లీ నీ లాంటి మగవాళ్ళందరూ ఇంతే! తమ పెళ్ళాలు కళకళ్ళాడుతూ, ఆరోగ్యంగా కళ్ళముందు తిరుగుతూ ఉంటే లోపల అంతరాంతరాళాల్లో వాళ్ళకెందుకో జెలసీ? వీలయినంత త్వరలో వాళ్ళు పిల్లల్నెత్తుకుని, వడలిపోయిన తోటకూరకాడల్లా అయిపోతే కాని వాళ్ళమగతనానికో సంతృప్తిలభించదు

"నో! నో! యూ ఆర్ రాంగ్!"

"నెవర్ మిష్టర్ రావ్! ఈ నాగమణి ఎప్పుడూ రాంగ్ కాదు. మీ మగవాళ్ళకు అనుభవిస్తే కాని లోకం తీరు తెలియదు. మా ఆడవాళ్ళు కళ్ళతో చూసి ఇట్టే గ్రహిస్తారు.

"అయితే నన్ను గురించి నువ్వు ఊహించింది. కూడా..."

"దబాయించకు రావ్! రాజమండ్రిలో మీ మేనత్త కూతురు సుశీల కదూ, అదీనేనూ క్లాస్‌మేట్స్."

హాతోస్మి! ఓడిపోయినట్టుగా నేను తలొంచుకున్నాను.

దూరంగా సముద్రంలో ఊగిసలాడుతున్న ఓడల్లోంచి దీపాలు మిణుకుమిణుకు మంటూ కన్పిస్తున్నాయి. సన్ అండ్ సాండ్ పక్కన వున్న రెడ్‌లైట్ హౌస్ భయపెడుతూ జ్వలిస్తోంది. రోడ్డుమీద జంటలు జంటలుగా మనుష్యులు. పరుగులు పెడుతున్న వాహనాలు.

ఆ సాయంకాలం నానుంచి విడిపోయిన నాగమణి; వాల్తేరులో వున్న రెండేళ్ళలోనూ ఒకటి రెండుసార్లకన్నా మళ్ళీ నన్ను కలుసుకోలేదు. కలుసుకున్న ప్రతిసారీ నా భార్యను గురించే ప్రస్తావన. నాకు పెళ్ళయిన సంగతి అందరికీ టాంటాం చేసింది. అందరికీ జోక్ చేసుకోటానికి నన్నో కామన్ టాపిక్ చేసింది

నేను కూడా నాగమణి గురించి ఏదన్నా చెబుదామన్నా, ఆ అమ్మాయినిగురించిబొత్తిగా నాకు ఏమితెలియకపోవడం పెద్దఇబ్బందైంది. అక్కడికి నాగమణి కథ. కమామీషూ ఏవిటంటూ సుశీలకో ఉత్తరం రాశాను.

జాగ్రత్త మావయ్యా! నాగమణి జోలికి వెళ్ళేవ్, అదో నాగుపాము లాంటిది" అంటూ సుశీల ఉత్తరం రాసింది. మరింకేం వివరాలు తెల్పకుండా.

సుశీల దగ్గర్నుంచి ఉత్తరం వచ్చిన ఓ వారం రోజులకు, యూనివర్సిటీక్యాంటీన్‌లో. ఫాన్ క్రింద కూచోపెట్టి నాగమణి నానా మాటలూ అని నన్ను దులిపేసింది.

ఏం? నన్నుగురించి నీకేం కావాలేవిటి వివరాలు? నీలాగా యింకా నాకేం పెళ్ళి కాలేదు. నీలాగా నేను ఎవరివెంటా పడడం లేదు కూడానూ! అమాయకురాలు సుశీలను ఎందుకూ అడగడం, నన్నడగరాదూ. చెబుతాను? మా నాన్న పేరు వెంకటసుబ్బయ్య. ఫస్టు వ్యాపారస్థుడు. గుంటూరు జిల్లా అసలు మాది. అయినా రాజమండ్రీ వచ్చేసి భూములు కొనుక్కున్నాం. మేం అయిదుగురు ఆడపిల్లలం. నేను రెండోదాన్ని. మా పెద్దక్కయ్య ఓ క్రిష్టియన్ని పెళ్ళిచేసుకుంది. మతం మాత్రం మార్చుకోలేదు. నేనుబి.ఏ.లో స్పెషల్ ఇంగ్లీషులో యూనివర్సిటీ ఫస్టు. నా ఎత్తు అయిదడుగుల మూడంగుళాలు. ఇదివరకు బరువు నూటపది పౌన్లు. కానీ ఇక్కడకు వచ్చి, ఈ యూనివర్సిటీలో హాస్టల్లో చేరింతర్వాత ఆ పదిపౌన్లు తగ్గిపోయి ఉంటుంది ఇహ కాంప్లెక్షన్.

అప్పటికి మాబల్లదగ్గర ఒకరిద్దరు పోగయ్యారు. అవతల టేబిల్స్ దగ్గర కూచున్న


నూతన సంవత్సర శుభాకాంక్షలతో

రావి రాఘవయ్య & సన్స్

బర్మాషెల్ ఏజంట్సు అండ్ డీలర్సు

H. O. చల్లపల్లి

ఫోన్ నెం. 19

బ్రాంచీలు

బందరు - గుడివాడ - బెజవాడ

46 77101

Phone : 77789

Sree Rejeswari Traders

Distributore for CIBA Agrochemicals

GOPLAREDDY ROAD, VIJAYAWADA-2

వాళ్ళుకూడా, తమ తమ మాటలు మాని మా వేపు ఆసక్తిగా గమనించడం మొదలెట్టారు. నాకు చచ్చిన చావుగా వుంది.

తలదించుకుని "ఐయామ్ సారీ!" అన్నాను మెల్లగా!

"దట్సాల్ రైట్!" అంటూ టేబిలు దగ్గర నుంచి నాగమణి కూడా లేచింది నిర్లక్ష్యంగా.

ఆ నాగమణి, సుబ్బారావ్‌తో స్నేహం చేసింది. శ్రీనివాసరావ్‌తో కలసి బీచి షికార్లు తిరిగింది. మహమ్మద్ ఇస్మాయిల్‌తో కలసి ఇంగ్లీషు సినిమాలకు వెళ్ళింది. కానీ ఎవరు కూడా ఆమెను గురించి పల్లెత్తు మాట అనేవారు కారు. ఒకళ్ళను అననిచ్చే వాళ్ళుకాదు. ఎవరితో ఎట్లా తిరిగినా, ఎవరితో బీచి షికార్లు కొట్టినా, ఎవరితో కలసి సినిమాలు చూసినా, మళ్ళీ నాగమణి సెమెస్టర్ పరీక్షల్లో ఫస్టు మార్కులు తెచ్చుకుంటూనే వుండేది. పుస్తకాల పురుగ్గా అందరిచేతా పిలిపించుకోబడేది. నాకు అందుకనే ఆవిడంటే జెలసీ! కానీ తనకు మాత్రం నేనంటే జెలసీ లేదనీ, పైగా ఇష్టమనీ, మేం యూనివర్సిటీ నుంచి బయటకు వచ్చేసిం తర్వాత ఓ ఉత్తరంలో రాసింది.

"ఎవరండీ మీరంటే ఇంతగా ఇష్టపడే ఈవిడ?" అంటూ ఆ ఉత్తరాన్ని చదివిన మా ఆవిడ ప్రశ్నించింది.

అప్పటికే నాగమణి, రాజమండ్రీలో ఆడపిల్లల కాలేజీలో ఇంగ్లీషు లెక్చరరుగా ఉద్యోగం సంపాదించుకొంది. నేనూ ఏలూర్లో సెటిలయ్యాను.

"మా క్లాస్‌మేట్!" అన్నాను నా శ్రీమతితో.

"ఊహు!" శ్రీమతి కంఠంలో ఓ అపనమ్మకం, "మగవాళ్ళంతే, క్యారెక్టర్‌లెస్ పీపుల్!" అన్న ధ్వని.

* * *

'జ్యోతి విహార్' యూనివర్సిటీలో, టీచర్స్ క్వార్టర్స్‌లో, రెండో అంతస్తు మీదినుండి, ఆ సాయంకాలం; హీరాకుడ్ ఆనకట్ట దగ్గరకు వెళదామన్న యత్నంలో, క్రిందికి వస్తుండగా, పరిగా గేటుదగ్గర టాక్సీలో నుండి దిగుతూ ఎదురైంది, నాగమణి. అదే రూపం! అదే లావు! అదే ఛాయ! శరీరంలో మాత్రం వొంపులు మరింత ప్రస్ఫుటమౌతున్నాయి. లోగడ కళ్ళకు కాటుక పెట్టుకొనేది కాదు. ఇప్పుడు కంటిచివర్ల వరకూ తీర్చి దిద్దుకుంది. చేతులకు ఒత్తుగా గాజులు. మొహాన కనిపించీ కనిపించకుండా చీరరంగు తిలకం. హైహీల్స్. మెడలో నల్లపూస లున్నట్లు లేవు. నన్ను చూసీచూడగానే "హల్లో రావ్! నువ్వా వచ్చావా ఈ సమ్మర్ ఇన్‌స్టిట్యూట్‌కు? వెరీగుడ్! ఇహ నాకేం భయంలేదు. దేశం గాని దేశంలో, ఈ ఒడియా వాళ్ళమధ్య ఎట్లారా భగవంతుడా? అనుకున్నాను. నువ్వున్నావ్, ఐయామ్ వెరీ హాపీ!" అన్నది గుక్కతిప్పుకోకుండా.

నాగమణి పక్కనే మరో అమ్మాయి కూడా ఉంది. సన్నగా, ఎర్రగా, భయంభయంగా. అటూయిటూ దిక్కులు చూస్తూ, కారు తలుపును

## క్రొత్త సీరియల్ ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవి, 'జ్ఞానపీఠం' అవార్డు గ్రహీత

**శ్రీ విశ్వనాధ సత్యనారాయణ**

వర్తమాన సమాజంపై ఛలోక్తులు చెళుకులు విసురుతూ
బలమైన సాంఘిక కథాశిల్పంతో అందంగా మలచిన నవల

# 'కుక్కగొడుగులు'

ఈ సంచికనుండి సీరియల్‌గా వెలువడుతుంది.

స్త్రీ పురుషుల చమత్కార సంభాషణలతో ప్రారంభం—

"నేను నిన్ను కోరి వచ్చాను"
"నీ పేరు 'పండు' కదూ?"
"ఔను" అంది ఆవిడ
"మంచి ఎంగిలి పండువు"
"ఎంగిలి పండ్లేకదా మీరాముడు తిన్నది"
"అచ్చంగా మా రాముడేమిటి మీరాముడు కూడాను. ఆరాముడు నీకెక్కువ మోక్షం యిస్తాడు."

ప్రముఖ చిత్రకారుడు 'బాపు' వేసిన రేఖాచిత్రంతో పై సంభాషణాక్రమంతో మొదలయ్యే సీరియల్ నవలను 161 వ పేజీలో చదవండి. ....సం॥

అనుకుని నిలబడింది. ఆ అమ్మాయి వేపు చూస్తూ, నవ్వుతూ." సరళా! ఇంకేం మనకు భయం లేదే! వీరు రావుగారని- చాలా మంచివార్లే! నాక్లాస్‌మేట్!" అన్నది, ఆ అమ్మాయిని తనకు దగ్గరగా లాక్కుంటూ

"నమస్కారమండీ!" అన్నది సరళ, విడీవిడని పెదిమలతో అతిమెల్లగా

"రావుగారూ! నిన్నరాత్రి నుంచీ ఈలోపల ఎన్ని ఎడ్వెంచర్లో మాకు? టాటా ఎక్స్‌ప్రెస్ మూడుగంటలు లేటు కావడంతో, ఒంటిగంటకు దిగాం సంబల్‌పూర్ స్టేషన్లో! ఏం స్టేషనది-వెధవ స్టేషను. ఓ వెయిటింగ్ హాల్ లేదు, ఓ లేడీస్ టాయిలెట్ లేదు. రిక్షా ఎక్కితే వాడి భాష మాకు తెలీదు. 'లాడ్జింగ్' అంటే ఓ బ్రోతెల్‌హౌస్ లాంటి ప్లేసుకు మమ్మల్ని తీసుకు వెళ్ళాడు. ఈపిల్లకు ఒకటే భయం. ఆంజనేయ దండకం చదువుకుంటూ ఓ ఇంటి అరుగులమీద కాలక్షేపం చేశాం రాత్రంతా!"

ఎంతసేపు నాగమణి అట్లా మాట్లాడేదో కానీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫీసునుండి, ఇన్‌ఛార్జ్ బాయ్ శ్వాయిన్ వచ్చాడు, డైరెక్టరు గారు చెప్పమన్నారంటూ ఓ వార్త తీసుకుని. ఇంకా లేడీస్ హాస్టల్ ఓపెన్ చెయ్యలేదు కాబట్టీ, ట్రయినింగ్ కోసం వచ్చిన వాళ్ళలో ఎక్కువ మంది ఒరియావాళ్ళే కాబట్టీ, అదిందుకో లేడీస్ ఎవరూ లేరు, కాబట్టీ, ఆంధ్రా నుంచి వచ్చిన ఈ ఇద్దరు అమ్మాయిలనూ కొంతకాలంపాటు ఆంధ్రులకోసం కేటాయించిన మగవాళ్ళ క్వార్టర్స్‌లోనే, వాళ్ళకు అభ్యంతరం లేకపోతే ఉండమని ఆ వార్తకు తాత్పర్యం.

"నాకేం అభ్యంతరం లేదు." అన్నది నాగమణి ఒక్కక్షణం కూడా ఆలోచించకుండా.

"ఏమ్ సరళా? నీ సంగతేమిటి మరీ?" అన్నది తనే మళ్ళీ.

"నువ్వెక్కడ ఉంటే నేనూ అక్కడే!"

వాళ్ళకు అభ్యంతరాల్లేకపోవచ్చు. కానీ మాకు ఉండవచ్చుకదా ఆ సంగతి వాళ్ళు ఆలోచించడం లేదు.

పై అంతస్థులో రెండేరెండు సింగల్ రూమ్స్. లావెట్రీ కమ్‌బాత్‌రూం ఒకటే, తాళం వేయడానికి వీల్లేని ఓ కామన్‌హాల్.

రెండు సింగల్‌రూమ్స్‌లోనూ ఒకదాంట్లో రిచర్డ్‌బర్టన్. క్రింద అంతస్థులో రాఘవరావ్ రాధాకృష్ణమూర్తి ఉంటున్నారు. రాధాకృష్ణమూర్తికి జుట్టుఇప్పుడిప్పుడే తెల్లబడుతోంది. రాఘవరావ్‌ది మరీ కుర్రవయస్సు. అందమైన ఆడపిల్ల అకారణంగా తనవైపుచూసినా, సిగ్గుతో ముడుచుకుపోయే యౌవనం. ఇహపోతే రిచర్డ్ బర్టన్, నేనూ ఉన్నాం.

బర్టన్ పొడుగ్గా నల్లగా ఉంటాడు. సిగరెట్లు కాల్చి కాల్చి నల్లబడ్డ పెదిమలు. నిర్లక్ష్యంగా పైకి దువ్విన క్రాపు. పట్టుదల సూచించే కొనతేలిన ముక్కు. ఇంగ్లీషుమాట్లాడినా, తెలుగు మాట్లాడినా అదోరకం యాస.

"నీ అభిప్రాయం ఏవిటి బర్టన్?" అని అతన్ని అడిగాను.

"ఐ వెల్‌కమ్‌దెమ్!" అన్నాడు పెద్దగా పట్టించుకోనట్లు.

"మరి వాళ్ళకు ఎకామడేషన్ ఏదీ?"

"డోన్ట్‌వర్రీ రావ్! నా రూం ఖాళీచేసి, నేను మీ రూంలోకి వస్తాను. ఆ ఇద్దరుయంగ్ లేడీస్‌నూ నా రూమ్‌లో ఉండమనండి!"

"ఓ కె. అదిబాగానే ఉంది. థ్యాంక్యూ మిస్టర్ బర్టన్!" అన్నది నాగమణి.

"రాబర్ట్ అని పిలవొచ్చు మీరు. ఇంట్లో అందరూ నన్ను అలాగేపిలుస్తారు! అఫ్‌కోర్స్ ఇన్‌క్లూడింగ్ మై వైఫ్!"

ఆ మాట విని సరళ బుగ్గలు ఎరుపెక్కడం నేను గమనించాను. నాగమణి మాత్రం నిర్లక్ష్యంగా" ఈజ్ ఇట్, ఫైన్!" అన్నది నవ్వుతూ.

బర్టన్‌కు చెయిన్ స్మోకింగ్ అలవాటు. ఆ నిత్యాగ్ని హోత్రుడితో వేగడం నాకు చాలా ఇబ్బందిగా వుంది. నాకు స్మోకింగ్ అంటే ఎలర్జ్! దానికి తోడు ఆష్ట్రే లేని ఆ రూములో ఎక్కడపడితే అక్కడ సిగరెట్టు పీకలు పడేస్తూ, నుసి రాలుస్తూ ఉండే వాడు బర్టన్. దుప్పట్లు, పక్కబట్టలు కూడా పొగవాసన వేసే స్థితికి వచ్చేశాయి.

"బర్టన్! పొగ నాకు పడదుసుమా!" అన్నాను అక్కడకీ ఒకసారి ఎటికెట్‌ని కూడా కాదని,

"ఐ కాన్ట్ హెల్ప్‌ఇట్!" అన్నాడతను పొగను రింగులు రింగులుగా పైకి వదులుతూ. గదులు ఊడ్చటానికి ఎవడూ వచ్చేవాడుకాడు గదిలో నాకీ బాధ.

"బిర్లా వెళ్దాం వస్తావా? అన్నాడు ఆ సాయంత్రం బర్టన్.

"సారీ మీరు వెళ్ళిరండి!"

బర్టన్, రాఘవరావ్, రాధాకృష్ణమూర్తి జోక్స్‌వేసుకుంటూ వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళింతర్వాత, ఉస్సురంటూ మంచం దిగి, ఓ రెండున్యూస్‌పేపర్లు చేతిలోకి తీసుకుని మెల్లిగా నేలంతా శుభ్రం చేయడం మొదలెట్టాను. వెనగ్గా తలుపుతీసుకుని నాగమణి లోపలకు వచ్చింది. ఆమెను చూడగానే చచ్చేచావైపోయింది. గదిని క్లీన్ చెయ్యాలన్న ఆత్రంలో తలుపులు దగ్గరకు వెయ్యడంకూడా మర్చిపోయాను. కాళ్ళమీదా, చేతుల మీదా ముందుకువంగికాయితాలఉండలతోదుమ్మంతా పోగుచేస్తున్న నేను మెడ వెనక్కి వంచి కళ్ళ చివర్ల నుంచి నాగమణిని చూసేసరికి, ఆమె కళ్ళు నవ్వుతున్న ఆ తెల్లని పళ్లు చిలిపితనంతో ఎగసిపడుతున్న ఆమెవక్షస్సు సన్నని

*With Best Compliments From*

**ARJUN TRADERS**

Distributors For:

**Jiyajee Fabrics Sikova Embroideries**

**138, GODOWN STRE T, (1St Floor)**

**MADRAS-600 001**

# నాగమణి పెళ్ళి

[ 20 వ పేజీ తరువాయి ]

నడుము, షేప్పింగ్‌గా ఉన్న ఆమెబొడ్డు, బొడ్డు కిందికి కట్టుకున్న పువ్వుల ఆర్గండీవాయిల్ చీర సుకుమారమైన పాదాలు. ఆ పాదాలకు వేసుకున్న ఎర్రని మొఖమల్ చెప్పులు కనిపించాయి.

నాగమణి నవ్వుతూనే గబగబా నాదగ్గరకు వచ్చింది. నా మీదకు వంగి నా మీదుగా చేతులు చాపి కాయితాల ఉండను లాగేసుకోబోయింది.

"నోనో !" అంటూ నేను చివాలున తల అటు తిప్పబోయాను. నా మొహానికి దగ్గరగా వెచ్చని ఊపిరి నా నుదుటికి తాకిన నాగమణి మృదువైన చెంపలు. లవెండరు వాసన. నా వేళ్ళతో పెనవేసుకున్న నాగమణి సుతారపు చేతివేళ్ళు నాగమణి దూరంగా జరిగిపోలేదు.

"యూసిల్లీ మ్యాన్ !" అంటూ నా వేళ్ళను మరింత బిగించింది. నా కళ్ళల్లోకి అర్థవంతంగా చూసింది.

"నాకు సిగరెట్టు పొగ పడదు నాగమణీ! అందుకని..."

"సిగరెట్లు తాగని వాడూ ఓ మగవాడేనా" అన్నది నాగమణి ఎగతాళిగా.

"స్మోకింగ్‌కూ; మగతనానికీ సంబంధమేమిటో?"

"మంచి సూట్ వేసుకుని; పాయింటెడ్ బూట్స్ వేసుకుని; దర్జాగా స్మోక్ చేస్తూ ఠీవిగా నిలబడ్డ మగవాణ్ణి చూడ్డంలో ఎంత ప్లెజర్ ఉంటుందో నీకేం తెలుసు?"

"అవునవును స్మోక్ చేసే రాబర్ట్ బర్టన్"

"...లుక్స్ క్వైట్ డిగ్నిఫైడ్!" అన్నది నాగమణి ప్రశంసా కంఠంతో.

ఇంతలో సరళ "నాగమణీ" అంటూ లోపలకు రావడంతో మేం దూరంగా జరిగాము. లైబ్రరీకి వెళ్ళాలంటూ వాళ్ళు వెళ్ళిపోయారు.

వెళ్తూ వెళ్తూ సరళ నావేపు మౌనంగా ప్రశంసాపూర్వకంగా చూసిన ఆ చూపు ... లేక నేనట్లా అనుకున్నానా?

రెండుమూడు రోజుల తర్వాత నాగమణీ; బర్టన్ కలిసి సంబల్‌పూర్ వెళ్ళారు, రాత్రి పదిదాటింది. ఇంకావాళ్ళు రాలేదు. నాకేదో అనుమానం జెలసీ.!

సరళ గదిలో లైటు వెలుగుతోంది. లోపలకు వెళ్ళాను. క్రిష్టాఫర్ నాటకం "ది లేడీ ఈజ్ నాట్ బర్నింగ్" చదువుకొంటోంది సరళ ప్రశాంతంగా! నన్ను చూడగానే పుస్తకం అవతల పెట్టి లేచి కూచుంటూ పాదాల మీదకు చీరలాక్కుని "రండి రండి" అన్నది ఆ స్వరంలో వో దగ్గరతనం.

"ఇంకా మీ ఫ్రెండ్సురాలేదు" ప్రక్కనే కుర్చీలో కూచుంటూ అడిగాను.

"రాబర్ట్ బర్టన్ కంపెనీ ఇస్తున్నారుకదా"

"ఇక్కడకు వచ్చేవరకూ అతనెవరో తెలీనే తెలీదు. అతనితో ఈ చొరవ..."

సరళ పెదిమల మీద జ్ఞానవంతమైననవ్వు "విశాఖపట్నంలో మీరు నాగమణీ చాలా క్లోజ్‌గా ఉండేవారట కదా?"

నా వీపుమీద చెళ్ళున ఓ కొరడా దెబ్బ. సరళే మళ్ళీ అన్నది "నాగమణి పరిస్థితులకు అనుగుణంగా తను మారదు. పరిస్థితుల్నే తనకు అనుకూలంగా మార్చుకుంటుంది.

ఆ తర్వాత ఏదో కాసేపు మాట్లాడి నా గదిలోకి వచ్చేశాను. వచ్చి పడుకున్నా నాగమణిని గురించే ఆలోచన. ఎంతమందితో నాగమణి ఇట్లా చనువుగా ఉంటుంది? ఆ చనువును ఎవరన్నా దుర్వినియోగం చేస్తే ఆమెకు అపకారం తలపెడితే...అప్పుడామె తనను తాను ఎట్లా కాపాడుకొంటుంది?

సమ్మర్ ఇన్‌స్టిట్యూట్‌లో వర్క్ చాలా హెవీగా ఉంటోంది. ఏవేవో పేపర్లు రాయిస్తున్నారు. ఎసైన్‌మెంట్స్ ఇస్తున్నారు. లైబ్రరీలో కూచోపెట్టి అడ్డమైన పుస్తకాలూ చదివిస్తున్నారు. హైస్కూలు పిల్లల్ని పోగుచేసి వరుసక్రమంలో మా ట్రెయినీస్ చేత డిమాన్‌స్ట్రేషన్స్ లెసన్స్ ఇప్పిస్తున్నారు.

నాగమణి తనవంతు డిమాన్‌స్ట్రేషన్ లెసన్ ఇవ్వలేదు. వెనగ్గా చూస్తే అందరూ ఉన్నారు బర్టన్ వేపు చూశాను. అతను తల వంచుకుని కూచుని నోట్స్ రాసుకుంటున్నాడు సీరియస్‌గా!

"సరళా" మెల్లగాపిలిచాను "నాగమణిఏదీ"

"రూములోనే ఉంది"

"ఏం?"

"తలనొప్పిగా ఉందిట!"

క్లాసుకాగానే అదరాబాదరా వెళ్ళాను-ఆమె గదికి తాళం వేసిఉంది. క్రిందకుదిగివచ్చాను రాధాకృష్ణమూర్తి కూడాలేడు అతని గదిలో రాఘవరావ్ స్నానానికి తయారవబోతున్నాడు నన్ను చూస్తూనే అర్థమైనట్లుగా,

"వాళ్ళిద్దరూ డామ్ చూడ్డానికి వెళ్ళారు" అన్నాడు.

"ఎవళ్ళిద్దరూ ?"

"మీ ఫ్రెండూ, మా ఫ్రెండూ!"

అతను బాత్‌రూంలోకి వెళ్ళబోతూ అన్నాడు, "కాసేపు కూచుంటారా, ఇప్పుడే వస్తాను."

"లేదు, లేదు, వెళ్ళిపోతున్నాను"

వెళ్ళబోతున్న నావేపు చూస్తూ మళ్ళీ అన్నాడు. "రేపు నేనడుగుతాను. సినిమాకు రమ్మనమని!"

ఆమాటవిని. అతణ్ణి చెళ్ళున చెంపమీద కొడదామనుకున్నాను. "ఒరేయ్! రాస్కెల్-ఆపిడంతటి చౌకబారు మనిషనుకుంటున్నావ్రా, ఎవరడిగితే వాడితో నల్లా సినిమాలకూ షికార్లకూ తిరగడానికి? తన వ్యక్తిత్వాన్నామె కాపాడుకొంటుందిరా? మగవాళ్ళనో ఆట ఆడిస్తుంది. వెర్రివెధవల్ని చేసి!" అని అందామనుకున్నాను. కానీ, ఏమీ అనలేదు. "ట్రై చెయ్!" అనేసి తిరిగొచ్చేశాను.


కానీ నా అంచనాలే తారుమారయ్యాయి. ఆమర్నాడు రాఘవరావుతో కలిసి సినిమాకు వెళ్ళింది. కారణం తెలీదు కానీ, సరళా, నాగమణీ దూర దూరంగా ఉండడం మొదలు పెట్టారు. నాగమణి, బర్టన్‌తో మాట్లాడడం పూర్తిగా మానేసింది. రాధాకృష్ణమూర్తిని దూరంగా ఉంచింది. రాఘవరావును తన గది చాయలకు కూడా రానద్దంది. నాజూకుగా అలంకరించుకోవడం తగ్గించింది. ముభావంగా ఆలోచనాత్మకంగా, ఉండడం మొదలెట్టింది.

"ఏవిటి నాగమణీ-ఎందుకిట్లా ఉంటున్నావ్? అన్నాను ఓ రాత్రి మెస్‌నుంచి తిరిగి వస్తూ ఆకాశంలో కాంతిహీనంగా మెరుస్తున్న చుక్కలు కొండలపైనుంచి పరుగెత్తుకు వస్తున్న వేడిగాలి. మలుపు తిరగగానే వేవ్ ఛాన్సలర్స్ లాడ్జిలో నుంచి పాశ్చాత్య సంగీతం వినవస్తోంది. రోడ్డు మీద ఎవరో వో బిచ్చగాడు ఒడ్డియా భజనగీతం ఒకటి పాడుకుంటూ పోతున్నాడు.

"ఎట్లావున్నాను?" నాగమణి కంఠం బరువుగా ధ్వనించింది.

"డల్‌గా, ఏదో పోగొట్టుకున్నదానిలాగా!"

"ఇంకా పోగొట్టుకోలేదు. పోగొట్టుకునే



దాన్నే! ఏవీ పోగొట్టుకోకుండా నన్ను నేను కాపాడుకోవడం ఎట్లాగా అని ఆలోచిస్తున్నాను."

"ఏ మైందిప్పుడు?" ఆత్రుతగా అడిగాను.

"ఏమీ కాలేదులే! ముందుకు నడు, నువ్వో గుడ్డివాడివి. మొదటినుంచీ ఇంతేకదా నువ్వు

మా కెదురుగా ప్యూయిన్ సైకిలు మీదవస్తూ, నన్ను చూసి దిగి, "టెలిగ్రాం సార్!" అంటూ నాకు దాన్ని అందించాడు.

ఇంటి దగ్గర ఫాదర్‌కి సీరియస్‌గా ఉందని, వెంటనే రమ్మనమని కబురు. వణుకుతున్న కంఠంతో" తెల్లవారుఝాము బండికి వెళ్ళాస్తాను నాగమణీ! అన్నాను

"నువ్వు వెళ్ళుతున్నావా " నాగమణి కంఠంలో మొదటిసారిగా బెదురు కనిపించింది.

"అయనకు కొంచెం తగ్గితే వచ్చేస్తాను తిరిగి!"

"మళ్ళీ ఇంతదూరం వస్తావా?"

"సర్టిఫికెట్స్ అవీ తీసుకోవాలి కదా?"

"నువ్విక్కడ వుంటే అదో ధైర్యంనాకు!"

కానీ ఆవిడకు ధైర్యం చెప్పడానికి నేనిక్కడే ఉండటానికి వీలుపడలేదు. ఇంటికి తిరిగివచ్చేసరికి, నన్నుకన్న తండ్రి కర్మలు పూర్తయ్యాయి, వైకుంఠ సమారాధన జరిపింతర్వాత, భారమైన హృదయంతో 'జ్యోతి విహార్'కు తిరిగి వెళ్లేసరికి, నాగమణి పెళ్ళికూతురుగా దర్శనమిచ్చింది.

"నీరాకకోసం వెయిట్ చేస్తూ, పార్టీ ఇవ్వడం డిలే చేశాను" అన్నది నాగమణి సంతోషంగా మళ్ళీ ఆమె మొహంలో పూర్వపు కళాకాంతులు కనిపిస్తున్నాయి. ఎంతో సుందరంగా అలంకరించుకొని, సరళతో చెట్టాపట్టాలు వేసుకుని, నాదగ్గరకు వచ్చింది.

"బ్రెయిడ్ గ్రూమ్ ఎవరో...?"

"పార్టీలో పరిచయం చేస్తాను!"

సాయంకాలం పార్టీ సమయం వరకూ నాలో ఆలోచనల దొంతరాలు. ఆమెకు తగిన వరుడు ఆంధ్రనుంచి వచ్చిన అభ్యర్థుల్లో ఎవ్వరూ నాకు కనిపించలేదు. మరి ఆమెకు అర్థాంతరంగా వరుడెక్కడనుంచి దొరికినట్లు?

ఆమె ఇస్తున్న పార్టీకి మూలమైనఅభ్యర్థి విషయం రాధాకృష్ణమూర్తి తనకు తెలీదన్నాడు.

"నాకూ ఆశ్చర్యంగానే ఉంది! అన్నాడు రాఘవరావు.

మీ స్నేహితురాలో సీతాకోకచిలుక. ఎగురుకుంటూ పోవడమే తప్ప ఎక్కడా స్థిరంగా ఉండదు." అన్నాడు బర్టన్.

అందరి కళ్ళూ, చెవులూ, మనసూ పార్టీ కోసం ఎదురుచూశాయ్. ప్రొఫెసర్ దాస్‌తో కలిసి, నలుగురు రీడర్ల మధ్యగా, మాకో బ్రెయినీ మొహపాత్రో సరళ చేయిచేయీ కలుపుకుని నవ్వుతూ నడుస్తూ వస్తున్నారు. మొహపాత్రో ఒరియావాడు. మాకు ఎదురుగా ఉన్న గదుల్లో ఉన్నవాడు. ఎర్రగా, సన్నగా ఉండి, యూనివర్సిటీలో ఫస్టు ర్యాంకులో వచ్చినవాడు.

నన్ను దగరకు పిలిచి మొహపాత్రోను ఫార్మల్‌గా పరిచయం చేసింది నాగమణి.

"అతనికి తెలుగు రాదులే!ఓమాటచెప్పనా?" అన్నది రహస్యం చెబుతున్నట్టుగా నాలో ఉత్సుకత పెరిగింది.

"ఇవ్వాళ గనక ఈపార్టీ జరక్కపోతే మొహపాత్రో ఒప్పుకుని ఉండకపోతే, నేను వర్జిన్‌గా ఇక్కడ మిగిలి ఉండేదాన్నికాదు. ఇక్కడ ఈపార్టీలో ఉన్న ప్రతీ వెధవకు నామీదే కన్ను నేను నేనుగా మిగిలి ఉండడం ఎవడికీ ఇష్టంలేదు."

"నీకూ, మొహపాత్రోకూ."

"ఎలా కలిసిందంటావా? నువ్వో గుడ్డివాడివని ఇదివరకేచెప్పానుకదా? సినిమాలకు తిరిగితేనూ, తోటల్లో విహరిస్తేనూ, వెంటబడ్డ మగవాణ్ని ఆడది తన వాణ్నిగా తీసుకోదు.

అదో స్వీట్ టెక్నిక్! నీకు తెలీదులే! ఈ సుఖాంతానికి సరళ, మైగుడ్ గరల్, కారణం!"

నేను సరళవేపు ప్రశంసా పూర్వకంగా చూశాను. సరళ కన్నుల్లో ఏదో గర్వం, ఒక విధమైన తృప్తి. రాఘవరావు, రాధాకృష్ణమూర్తి, బర్టన్ మొహాలు ముడుచుకొని, కోపంగా, అసహనంగా, ఈర్ష్యగా ఉన్నాయ్. నేను సంతోషంతో, మొహపాత్రో చేతిని, నా చేతిలోకి తీసుకుని, "కంగ్రాచ్యులేషన్స్" చెప్పాను అతని మొహంలో అమాయకత్వం కనిపిస్తోంది.